# నాటకం

పల్లవి కళ్లముందు పట్టపగలే చుక్కలు మెరుస్తున్నాయి. పదేపదే మెట్లెక్కి దిగీ ఆమె అలసిపోయింది. ఫ్లడ్‌లైట్స్ వేడిమికి ఆమె ముఖం కందగడ్డలా ఎర్రబడిపోయింది.

"టీ బ్రేక్" అరిచారెవరో.

బ్రతుకుజీవుడా అనుకుంటూ వెళ్ళి చెట్టుకింది చప్టామీద కూలబడింది. బాసింపట్టు వేసుకు కూర్చుని నొప్పులు పెడుతున్న పాదాలను రెండు చేతుల్తో ఒత్తుకోసాగింది. చెమటలు దిగకారి బ్లౌజంతా తడిసి ముద్దయ్యింది. ఐ షేడు కరిగి కళ్ళల్లోకి జారి కళ్లు మంటలు పెడుతున్నాయి.

మేకప్ టచ్ చేసుకోమని అద్దం, పౌడర్‌కేక్ ఇచ్చి వెళ్ళాడు బోయ్. పీక్కుపోయిన ముఖాన్నీ, ఎర్రబడిపోయిన కళ్లనీ అద్దంలో చూసుకున్నాక పల్లవి కళ్ళు నీటి చెలమలయ్యాయి. ఎత్తైన ఆలయశిఖరం ఆ కన్నీళ్ళలోంచి మసక మసకగా కన్పిస్తోంది.

"హరియప్ లైట్ ఫేడయ్యేలా వుంది" అరుస్తున్నాడు కెమెరా అసిస్టెంట్. పల్లవి కర్చీఫ్‌తో కళ్ళు ఒత్తుకుని గబగబా మేకప్ సరిచేసుకోసాగింది.

అనుకోకుండా ఆమె కళ్లు ప్రకాష్ కోసం వెదికాయి. అతను రెయిలింగునానుకుని దూరంగా పంపానది రిజర్వాయరులో నిలిచి వున్న నీటిని చూస్తున్నాడు. ఆ సాయంసంధ్య వేళలో నీరెండ పడి మెరుస్తూన్న చిన్ని చిన్ని అలల్నీ, కొండల మధ్య ఒంపులు తిరిగి ప్రవహిస్తూన్న పంపానదినీ అలాగే చూస్తూ వుండి పోవాలన్పించింది పల్లవికి.

మూడు నెలల క్రితం అన్నవరం వచ్చినప్పుడు ప్రకాష్ తనూ ఈ అందాల్ని ఎంతగా ఎంజాయ్ చేశారు! ఫ్లవర్ గార్డెన్‌లో గులాబీల మధ్య తిరుగుతున్నప్పుడు "ఈ పూలలో ఓ పువ్వులా వున్నావు నువ్వు" అన్నాడు ప్రకాష్. ప్రకాష్ అంతగా మెచ్చుకొనే తన రూపమంటే పల్లవికెంతో ఇష్టం.

టచప్ పూర్తి చేసుకుని పల్లవి లేవబోతూండగా పడమటి కొండల వెనక నుంచి పల్చటి మబ్బుతెరొకటి సూర్యబింబాన్ని ఆక్రమించుకుంది. 'హుష్' అని తలపట్టుకున్నాడు పాపారావు నాయుడు. అతను ప్రొడక్షన్ మేనేజరు. కాఫీలు సప్లై చెయ్యడం దగ్గర్నుంచి లైట్స్

ఎరేంజ్ చెయ్యడం వరకూ అన్నీ అతనే చూస్తున్నాడు. కథొక్కటి తక్కువగాని ఓ సినిమా తీస్తున్నంత హడావుడి జరుగుతోందక్కడ.

యాడ్ కంపెనీ ప్రొడ్యూసర్ రమేష్ అంబరిల్లా కింద కూర్చుని కూల్‌డ్రింక్ తాగుతూ పాపారావుని నమిలి మింగేసేలా చూస్తున్నాడు. అక్కడికా మబ్బుల్ని పాపారావే రప్పించాడన్నట్టు. మరో మోడల్ మౌసమీ సనారా అతని పక్క కుర్చీలో అతన్ని ఆనుకుని కూర్చుని అయిందానికీ కానిదానికీ అందమైన పలు వరసంతా కన్పించేలా నవ్వుతోంది.

వారం రోజులుగా యాంగ్జైటీ, రెండు రోజులుగా నిద్రలేమి, రెస్ట్‌లెస్‌నెస్, మేకప్-లిప్‌స్టిక్ చెరిగిపోతాయని ఉదయం నుంచి చేసిన ఉపవాసం అన్నీ కలిసి పల్లవికి నీరసం ముంచుకొస్తోంది. ఆ చెట్టుకింద అలా నడుం వాల్చి నిద్రలోకి జారుకోవాలని వుంది.

ఈ జనానికిదేం వేలంవెర్రో తెలీదు, దైవదర్శనం చేసుకోవడం మర్చిపోయి మరీ షూటింగ్‌ను చూస్తున్నారు. మేకప్‌లో వున్న తననీ, మౌసమీని చూడడమే తమ జీవితధ్యేయ మన్నట్టు ప్రవర్తిస్తున్నారు.

ఈ షూటింగ్‌ను గురించీ, మోడలింగ్ చేసే అమ్మాయిల గ్లామరస్ జీవితాన్ని గురించీ ఎన్నెన్ని కలలు కన్నది తను. ఎంత గొప్పగా ఊహించుకుంది! వద్దు బాబోయ్ వద్దు, కలలో కూడా ఈ  జీవితం వద్దు.

అసలిదంతా ఎలా మొదలైందో ఆ సమయంలో గుర్తుకొచ్చింది పల్లవికి.

కాలేజ్ ప్రేమను పదిలంగా పెంచి పోషించుకుని ప్రకాష్ ఎల్లెల్బీ రిజల్ట్స్ రాగానే రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నారు ఇద్దరూ. ఇరువైపుల పెద్దలూ అంగీకరించకపోవడంతో సొంతంగా జీవనాన్ని ప్రారంభించాల్సివచ్చింది. ఎన్నో తంటాలుపడి సీనియర్ లాయరొకాయన దగ్గర అప్రెంటిస్‌గా చేరాడు ప్రకాష్.

డిగ్రీ చేసిన పల్లవి ఓ ప్రైవేటు స్కూల్లో టీచరుగా జాయినైంది. సంపాదించే కొద్దిపాటి డబ్బుల్తో ఇంటిని పొదుపుగా-ఎలా నడపాలో పెళ్లైన ఆరునెలల్లోనూ పల్లవికి బాగానే పట్టుబడింది.

జీవితంలో స్థిరపడే వరకూ పిల్లలొద్దనుకున్నారు. టీవీ. ఫ్రిజ్‌లాంటి ప్రస్తుత జీవనంలోని లగ్జరీస్ మాత్రం ఇద్దర్నీ బాగా ప్రలోభపెడుతున్నాయి.

మూడు నెలల క్రితం డైలీ పేపర్లోని ఓ కటింగ్ తెచ్చి పల్లవి చేతికిచ్చాడు ప్రకాష్ బ్యూటీ కాంటెస్ట్ వివరాలవి. చదివి - "ఎందుకిది?" అడిగింది పల్లవి.

"మన టౌన్‌లోనే కదా, సరదాగా పాల్గోరాదూ!"

"బాగుంది, నీ కళ్ళకి నేను అందంగా కన్పడుతున్నానని అందరికీ అలాగే కన్పిస్తానను కుంటున్నావా?"

"కన్విన్స్తావో లేదో చూద్దాం"

జిల్లా కేంద్రంలో నిర్వహించబడిన ఆ చిన్న బ్యూటీ కాంటెస్టులో అలా పాల్గొంది పల్లవి. ప్రకాష్కే కాదు, అందరికీ ఆమె అందంగానే కన్పించి ఫస్ట్ ప్లేస్ సంపాదించుకుంది. ఆ కాంటెస్ట్కి జడ్జిగా వచ్చిన యాడ్ కంపెనీ ఎమ్.డి. రమేష్ పల్లవిని నాలుగైదు రకాల యాంగిల్స్లో ఫోటోలు తీయించి పట్టుకెళ్ళాడు. స్క్రీన్ టెస్ట్ చెయ్యాలని హైదరాబాద్ పిలిపించాడు. ప్రకాష్, తను అప్పుచేసి మరీ వెళ్ళొచ్చారు.

"వచ్చే నెలలో అన్నవరంలో ఒక టాల్కం పౌడరు యాడ్ తీయాల్సి వుంది. ఫోన్ చేసి కారుపంపిస్తా, వస్తావా?" అని అడిగాడు రమేష్.

తను ఆలోచిస్తూంటే, "ఇది కూడా మీ ఆయన్ని అడగాలా, మీ ఊరికి అన్నవరం దగ్గరేగా, ఒప్పేసుకో" అన్నాడు పాపారావు నాయుడు. "ఇలాంటి యాడ్స్లో కన్పిస్తే తొందరగా సినిమాల్లో ఛాన్సొస్తుంది".

తన నిర్ణయంతో పని లేకుండానే ఇవన్నీ జరిగిపోతూండడం పల్లవికి ఆశ్చర్యంగానూ, కొంత ఆనందంగానూ వుంది. ప్రకాష్, తనూ జీవితంలో స్థిరపడడానికి తన అందం ఉపయోగపడబోతోందని తల్చుకుంటే కొంత గర్వంగానూ వుంది.

వచ్చే నెలన్నది ఇప్పటికప్పుడే రెండునెలలు దాటింది. ఈలోపల మూడుసార్లు వాళ్ళు వస్తున్నామని, తయారుగా వుండమని ఫోన్ చేసి రాలేదు. వారం క్రితం ఫోనొచ్చినప్పుడు ఎదురింటి ఇంజనీరు గారి భార్య విసుక్కుంది 'అస్తమానూ ఈ ఫోన్లేమిటి, మా నెంబరెందుకిచ్చారు?' అని.

ఫలానా రోజు తప్పకుండా షూటింగ్ వుంటుంది. రెడీగా వుండమని కబురు. ఈ వారం రోజులుగా పల్లవి కంటిమీదికి నిద్రే రాలేదు. భరించలేని యాంగ్జైటీతో తిండి నోటికి పోయేదికాదు.

నిన్న ఉదయం వస్తుందన్న కారు మధ్యాహ్నం వచ్చింది. ఆ టైంలో ప్రకాష్ ఇంట్లో లేడు. కోర్టుకెళ్ళిపోయాడు. ప్రకాష్ వస్తేగాని తను రాననడంతో డ్రైవరు వెళ్ళిపోయాడు. అరగంటలో మళ్ళీ తిరిగొచ్చి "మా కార్లన్నీ ఇప్పుడెళ్ళిపోతున్నై, సాయంకాలం మీ అంతటికి మీరే రావాల్సి వుంటుందట, సారుచెప్పమన్నాడు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

సాయంకాలం ప్రకాష్ వచ్చాక కనుక్కుంటే తెల్సింది టీమ్ వాళ్ళంతా అన్నవరం వెళ్ళిపోయారని. అప్పటికప్పుడు వాళ్ళ లాయర్ దగ్గరకి పరుగెత్తి ఐదువందలు అప్పు తెచ్చాడు ప్రకాష్. టాక్సీ మాట్లాడుకుని అన్నవరం చేరే సరికి రాత్రి తొమ్మిది దాటింది.

ఎందుకైనా మంచిదని తన దగ్గరున్న వాటిల్లో కాస్త మంచివన్పించే చీరలు రెండు, పంజాబీ డ్రెస్సొకటి బేగ్లో సర్దుకుంది పల్లవి. అన్నవరంలో షూటింగ్ వాళ్ళున్న గెస్ట్హౌస్ను పట్టుకోవడం పెద్ద కష్టమేం కాలేదు. పెళ్ళిళ్ల సీజన్కాక కొంత తెరిపిగా వుంది.

పల్లవి వెంట ప్రకాష్‌ను చూసి మొహం చిట్లించాడు రమేష్. "వాళ్ళకొక రూం ఇవ్వండి" అన్నాడు కొంత నిర్లిప్తంగా, కొంత చికాగ్గా.

పల్లవిని పక్కకి పిల్చి "ఇదేమన్నా హనీమూన్ ట్రిప్పా మీ ఆయన్ని వెంటేసుకు రావడానికి, ఆ మాత్రం ఇండివిడ్యుయాలిటీ లేకపోతే మోడలింగ్‌లో ఎలా రాణిస్తావమ్మా" అన్నాడు పాపారావు నాయుడు.

"ఏమిటి సంగతి?" అంటూ దగ్గరకొచ్చిన ప్రకాష్‌ను చూసి "అబ్బే, ఏంలేదు. మీ డ్యూటీకి సెలవు పెడితే నష్టమేం లేదా అనడగుతున్నా" అన్నాడు.

రూంలో కొచ్చాక "బొంబాయినుంచి వచ్చినమ్మాయీ, రమేష్ నిన్న టౌన్లో ఒకేరూంలో వున్నారు తెల్సా" అన్నాడు ప్రకాష్ కొంటెగా నవ్వుతూ.

"పోనిద్దూ, ఎవరిష్టం వాళ్ళది". అంది పల్లవి. "ఇదేం హనీమూన్ ట్రిప్పా అన్నాడు నాయుడు".

"పోనీ అలాగే అనుకుంటే పోలా" అన్నాడు ప్రకాష్ పల్లవిని హత్తుకుంటూ.

"అంతేలే, లేకపోతే టాల్కం పౌడరు యాడ్ అన్నవరంలో తీయ్యడమేంటి?" అంది పల్లవి.

మేకప్ వేసుకోవాలి లెమ్మని రెండు గంటలకే లేపేశారు. నిద్రపట్టేసరికే ఇంచుమించు ఒంటిగంట కావచ్చిందేమో, పల్లవికి కళ్ళు భగ్గున మండాయి. ఇంకొక్క గంట నిద్రపోనిమ్మని అడుగుదాం అనుకుందిగానీ ఏమంటే ఏం తంటానో అని మానుకుంది.

ప్రకాష్ అటు తిరిగి ముణగదీసుకు పడుకున్నాడు.

బ్రష్ చేసుకుని, చల్లని నీళ్ళతోకళ్ళను కడుక్కుని మేకప్ రూంలోకెళ్ళి కూర్చుంది పల్లవి.

మూడున్నరదాటేక స్థిమితంగా ఆవలించుకుంటూ వచ్చాడు మేకప్‌మేన్.

పల్లవి మొహానికి క్రీం పట్టించేసి చాయ్ తాగొస్తానని ఎటో పోయాడు. ఆ పోవడం పోవడం ఐదు దాటాక వచ్చాడు. ఈలోగా పాపారావు నాయుడు రెండసార్లొచ్చి చూసి వెళ్ళాడు.

"ఓరి దుర్మార్గుల్లారా, నా నిద్రంతా చెడగొట్టారు కదరా' అని లోపల్లోపలే తిట్టుకుంది పల్లవి.

సిగరెట్టు మీద సిగరెట్టు తాగుతూ రూం నిండా పొగపెట్టాడు మేకప్‌మేన్. ఆ పొగకు ఉక్కిబిక్కిరౌతూ అలాగే భరిస్తూ కూర్చుంది పల్లవి.

ఆరు గంటలకల్లా మేకప్, హెయిర్‌స్టైల్ పూర్తి చేసి వెనకనించి అనవసరంగా పల్లవి రెండు భుజాల మీదా చేతులు వేసి నొక్కి "అచ్చం అప్సరసలా వున్నావ్, అద్దంలో చూసుకో" అన్నాడు.

'యాభై దాటి వుంటాయ్, వీడికిదేం పొయ్యేకాలం' అనుకుంది పల్లవి మనసులో.

చీర కడతానని తయారయ్యాడు."వద్దులే, నేను కట్టుకోగల్ను" అంది పల్లవి.

"నువ్వు కట్టుకునేలా పనికిరాదు. వేరేలా కట్టాలి' అంటూ ఇష్టమొచ్చిన చోటల్లా చేతులు వేశాడు.

ఆ సరికి ప్రకాష్ లేచి పల్లవిని వెతుక్కుంటూ వచ్చాడు. "కాఫీ తేనా, తాగుతావా" అన్నాడు.

"భలేవాడివేలే, మేకప్ పూర్తయ్యాక కాఫీ తెచ్చిస్తావా, లిప్‌స్టిక్కంతా చెరిగిపోదూ" అన్నాడు మేకప్‌మేన్. "జాగర్తమ్మోయ్, పదే పదే టచప్పులివ్వడం నావల్ల కాదు" అనేసి బైటికి పోయాడు.

పౌడరు, కేకులు సర్దుతూన్న కుర్రాడిని "ఆ బొంబాయి అమ్మాయికి మేకప్పెయ్యరా" అంది పల్లవి.

"ఆరింకా లేవలే. లేచేక ఆరి రూంలోకెళ్ళి ఎయ్యమన్నాడు సారు" చెప్పాడు కుర్రాడు.

పల్లవికి ఒక్కక్షణం మనసు చివుక్కుమన్పించింది. ఆ బొంబాయి అమ్మాయికి కూడా మోడలింగ్ కొత్తనే విన్నది. అయినా ట్రీట్‌మెంట్‌లో ఎంత పార్షియాలిటీ చూపిస్తున్నారు!

పది గంటలకి మౌసమీ మేకప్ పూర్తిచేసుకుని పల్చటి దేతావస్త్రం లాంటి చీర, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో వచ్చింది. ఆ అమ్మాయి కన్నా తనే బావున్నాననుకుంది పల్లవి. ప్రకాష్ కూడా ఆ మాటే అన్నాడు.

కూర్చుని కూర్చుని విసుగొచ్చేస్తూంటే -

"ఏమిటాలస్యం?" అనడిగింది.

ప్రకాష్ బైటికెళ్ళొచ్చి "సరిపోయింది, ఇంతకీ కెమెరా టీమ్ రాలేదట హైద్రాబాదు నుంచి" అన్నాడు.

"వచ్చేస్తుందొచ్చేస్తుంది. ఈలోగా దైవదర్శనం చేసుకురండి" అని తరిమేడు పాపారావు నాయుడు.

పదకొండు గంటలకు కెమెరా వచ్చిందన్నారు. ఇంకాస్సేపటికి ఎండోమెంట్స్ నుంచి తెచ్చిన పర్మిషన్ ఎక్కడో పోయిందన్నారు. మళ్లీ దొరికిందన్నారు. అంతలో కరెంటు పోయిందన్నారు.

లైటెక్కువైందనీ, తక్కువైందనీ.. రెండు దాటేక షూటింగ్ ప్రారంభించారు.

ముందుగా మౌసమిని, పల్లవిని కలిపి రెండు మూడు షాట్లు తీశారు. తర్వాత మౌసమీతో తొందరతొందరగా ముగించారు. ఆవిడ ఆంధ్రా ఎండల్ని తట్టుకోలేక పోతోందట. పై నుంచి నీళ్ళు పడుతున్నచోట, రంగు రంగుల పూల మధ్య, నాట్య మంటపం శిల్పాల పక్కన మౌసమీ రకరకాల భంగిమల్లో నిలబడి పాడరు చల్లు కుంటూండగా ఫిల్మ్ తీశారు.

పల్లవిని మాత్రం మెట్లెక్కుతూ, దిగుతూ, ఆలయ గోపురం బ్యాక్‌గ్రౌండులో తీస్తున్నారు.

'ముప్పై సెకన్ల యాడ్‌కి మూడువేల షాట్లెందుకో" అనుకుంది పల్లవి నీరసంగా.

ఎవరో కొట్టిన చప్పట్లకు గోపురం మీది పావురాలన్నీ ఒక్కసారిగా టపటపమని రెక్కలు విదుల్చుకుంటూ గాలిలోకి లేచాయి. ఆ దృశ్యం కన్నుల పండుగగా అన్పించింది పల్లవికి. ఆ పావురాల్లో తనూ ఓ పావురంగా మారిపోతే...

"పల్లవీ, హరియప్..." తొందర తొందరగా లేచి వెళ్ళింది పల్లవి. రాత్రి పది వరకూ లొకేషన్స్ మార్చి మార్చి పల్లవితో షాట్స్ తీస్తూనే వున్నారు. ఒక దశలో పాపారావు నాయుడు ప్రకాష్ దగ్గరకొచ్చి "నాయనా, అమ్మాయిని మేం జాగ్రత్తగా తీసుకొస్తాంలే, నీకు కోర్టు పోతుందేమో వెళ్ళరాదూ" అన్నాడు.

"కోర్టెక్కడికీ పోదులెండి, పల్లవిని తీసుకునే ఇక్కడ్నించి వెళ్తాను" అన్నాడు ప్రకాష్

టీమ్ వాళ్ళంతా రెస్ట్ తీసుకోవాలని ఆ రాత్రి కొండపైనే వుండిపోయారు. తిరిగి వచ్చేటప్పుడు బస్సులో నిస్సత్తువగా చేరబడిపోయిన పల్లవి భుజం చుట్టూ చెయ్యివేసి ప్రకాష్ అన్నాడు -

"ఆ రమేష్ గాడు డబ్బులివ్వకుండానే నీచేత వర్క్ చేయించుకుని చెక్కేద్దామనుకున్నాడు. మన దగ్గర ఆ పప్పులుడకవని చెప్పేను. మొదటిసారి యాడ్‌లోకి తీసుకోవడమే గొప్పన్నట్లు మాట్లాడేడా నాయుడు. అందుకే మన 'లా' తడాఖా చూపించి రెండు వేలకి చెక్కు సంపాదించేను"

ఆ బొంబాయి అమ్మాయి మౌసమీకి పదివేలిచ్చారని వింది తను. ఆ మాటే ప్రకాష్‌తో అనబోయి చీకట్లోకి చూస్తూ మౌనంగా వుండిపోయింది పల్లవి.

పల్లవికి యాడ్ కంపెనీవాళ్ళిచ్చిన పోస్ట్ డేటెడ్ చెక్కు చెల్లదని తిరిగొచ్చింది.

ప్రకాష్ తన 'లా' తడాఖా చూపించి వాళ్ళ మీద కోర్టులో కేసు వెయ్యాలని సిద్ధమౌతుండగా రెండు నెలల తర్వాత టీ.వీ.లో యాడ్ వచ్చింది.

దాన్లో మౌసమీ సనారా తప్ప పల్లవి ఎక్కడుందో ఎంత వెదికినా కన్పించలేదు.

*స్వాతి వీక్లీ, 16.5.1997*